
# ఈ వారం కథ

— ఏ.వి. సుబ్రహ్మణ్యం

# 'ఇండిపెండెంట్'



సుబ్బారావు మొహం చాటంతయింది. అతడి బుర్రలో లక్షవోల్టుల కాంతితో మెరిసిన ఆలోచన అందుక్కారణం. అంత గొప్ప ఆలోచన తనక్కలిగినందుకు తన బుర్రమీద అతడికి అపారమైన గౌరవం ఏర్పడింది.

ఆనందంతో జుట్టు పీక్కోవాలనీ, 'హుర్రే' అని ఎగిరి గంతెయ్యాలనీ అనిపించింది. తనది బట్టతల కావటం వలనా, ఆ ముందు రోజే బాత్రూమ్‌లో కాలుజారి పట్టం వలనా ఆ ప్రయత్నాలు విరమించుకున్నాడు. ఈ దెబ్బతో తన దరిద్రం తీరిపోవటమే కాదు— తనకు బోల్డంత పబ్లిసిటీ కూడా వచ్చేస్తుంది.

హోహోహో

సుబ్బరావు నిరుద్యోగి కాదుగానీ, జీవితాన్ని 'జీవితం'లా జీవించేందుకు ఉపకరించని ఓ నిరుద్యోగి.

నిత్యజీవనంలో ఎదురయే కష్టాలనూ, కడగండ్లనూ మధ్యతరగతి మందహాసం చాటునా, భేషజాల మాటునా దాచుకుని రోజులు ఈడ్చుకువెళ్ళే ఓ సగటు మనిషి. ఈ దివ్యమంగళ దిక్కుమాలిన జీవన నేపథ్యంలో సుబ్బారావుకీ ఆలోచన వచ్చింది.

త్వరలో జరుగనున్న పార్లమెంట్ మధ్యంతర ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలన్నది ఆ ఆలోచనా తాత్పర్యం. ఏదో పార్టీ తరఫు అభ్యర్థిగా టికెట్ తెచ్చుకునే ఆర్థికపుష్టీ, అంగబలమూ,

కులపరమైన అర్హతా తనకు లేవు కాబట్టి చచ్చినట్టు ఇండిపెండెంట్‌గానే పోటీ చేయక తప్పదు. ఆలోచన వచ్చిందే తడవుగా వేగంగా ఇంటికి చేరుకున్నాడు.

ఇంట్లో అడుగుపెట్టగానే, 'బియ్యానికి డబ్బులు తెచ్చారా?' అంటూ ఏడుపు ముఖంతో ఎదురయే అర్థాంగి...

'ఇవాళ కూడా స్కూల్లో ఫీజు కట్టలేదని మమ్మల్ని ఇంటికి పంపేశారు' అంటూ బిక్కముఖాలతో నివేదిక సమర్పించే సంతతీ...

నోట్లో చుట్ట పెట్టుకుని వాకిట్లో గూర్ఖాలా

నిల్చుని 'సుబ్రావ్! ఈ నెలతో ఎనిమిది నెలలు. అద్దె కడతావా? చెంబూ, తపేళా బైట పారే యమంటావా?' అంటూ నిలదీగా ప్రశ్నించే ఇంటి ఓనర్ అలియాస్ రాక్షసుడు.

తమ అప్పులన్నీ ఎగ్గొట్టి ఏ రాత్రికి రాత్రో బిచాణా ఎత్తేస్తాడేమోననే భయంతో సుబ్బారావును కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఆ పరిసరాల్లోనే ముష్టివాళ్ళల్లా తచ్చాడే అప్పులవాళ్ళు.

దేశం ఇరవయ్యొకటో శతాబ్దం కాదు.. అరవయ్యారో శతాబ్దానికి చేరుకున్నా— ఏ మార్పుకూ నోచుకోని, ఎదుగూబొదుగూ వుండని పగటు జీవి దైనందిన జీవన వైభోగానికి సుబ్బారావు ఇల్లు ఓ దర్పణం.

## బిలీవ్ ఇట్ ఆర్ నాట్!

'బిలీవ్ ఇట్ ఆర్ నాట్' పేరుమీద ఆశ్చర్యం కలిగించే యదార్థాలని సేకరించి, కార్టూన్‌లతో ప్రచురించిన రాబర్ట్ యల్.రిప్లే పేరు వినని వారూ, అవి చదవని వారూ వుండరు.

ప్రపంచం నలుమూలలా వున్న అతని అభిమానుల నుంచి రిప్లేకి సంవత్సరానికి కనీసం పది లక్షల ఉత్తరాలు వచ్చేవి. ఒక సంవత్సరం ముప్ఫయి లక్షల ఉత్తరాలు అందుకుని రిప్లే 'పోస్టల్ హిస్టరీ' సృష్టించాడు.

విలియమ్స్ రాండాల్ఫ్ హెర్‌స్ట్ ప్రచురించే పత్రికలలో రిప్లే నిర్వహించే 'బిలీవ్ ఇట్ ఆర్ నాట్' శీర్షిక 'అభూత కల్పనల పుట్ట' అని భావించినవారు అతనికి రాసే ఉత్తరాల మీద చిరునామా "ప్రపంచంలో పెద్ద అబద్ధాలకోరు' అని మట్టుకే రాసి పోస్ట్ చేసేవారు. అయినా ఆ ఉత్తరాలు అతనికి అందేవి.!

వేలాది వింత సంఘటనలని, విషయాలని మనసులో గుర్తుపెట్టుకునే రిప్లేకి తన ఆఫీస్ టెలిఫోన్ నంబర్ మటుకు జ్ఞాపకం వుండేది కాదు. బిలీవ్ ఇట్ ఆర్ నాట్!

— 'బంటి'

కేవలం ఐదువందల డిపాజిట్ చెల్లించి నామినేషన్ వేస్తే చాలు. ఏడు లక్షల బ్యాలెట్ పత్రాలపై తన పేరు. పత్రికల్లో ప్రచారం. ప్రధాన పార్టీల తరఫు అభ్యర్థుల దృష్టి నాకర్షింపవచ్చు. అందరి చర్చల్లో తానూ ఓ అంశం. తను గెలవటం అసాధ్యమే కావచ్చుకానీ, పోలింగ్ రోజు ఏజెంట్ పాసులమ్ముకోవచ్చు. అలాగే కౌంటింగ్ రోజు కూడా ఏజెంట్ పాసులకు మాంచి డిమాండ్ వుంటుంది. ఇవికాక చివరి నిముషంలో పోటీ నుంచి ఉపసంహరించుకుంటే రెండు పార్టీల వాళ్ళూ ఎంతో కొంత ముట్టజెపుతారు. ఇవన్నీ కాక మరో ఆశ. పెద్ద పార్టీల అభ్యర్థులిరువురూవట్టి వెధవాయిలు. ప్రజల్లో వారిపట్ల మంచి అభిప్రాయముండే అవకాశమే లేదు. ఇక మిగిలిన ఇండిపెండెంట్లలో తనే బెటర్ క్యాండిడేట్. ఆ మధ్య వరుసగా 'స్థానిక సమస్యలు' అనే శీర్షికకు తాను వ్రాసిన ఉత్తరాలు పేపర్లో పడ్డాయి. బహుశా వాటిని అందరూ చదివే వుంటారు కాబట్టి ప్రజల్లో తనకు ఓ గుర్తింపు వుండి వుంటుంది. పెద్ద పార్టీ క్యాండిడేట్ల మీది వ్యతిరేకతతో ఓటర్లందరూ తనవైపు మొగ్గు చూపితే.. తాను కనీసం లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచేందుకు 'ఎడ్జ్' లేకపోలేదు. నిజంగా అదే జరిగి తాను ఎంపీ అయితే...?

అమ్మో. అంతకు మించి ఊహల్ని నింపుకునేందుకు సుబ్బారావు బుర్ర 'పర్మిట్' చేయలేదు. ప్రాక్టికల్‌గా ఎటూ నోచుకోకపోయినా, కనీసం 'ఇమాజినేషన్'కైనా అనుమతించని సామాన్యుడి దరిద్రపు బుర్ర అది.

"డబ్బు చేతికి రాగానే ఓ ఏడాదికి సరిపడా బియ్యమూ, గ్రటా కొనిపడేయాలి. తన దరిద్రాన్ని పంచుకునేందుకే పుట్టిన తన భార్య సుబ్బలక్ష్మికి నానితాడూ వగైరాలు చేయించాలి. పిచ్చి మొద్దు. ఎప్పుడూ ఏదీ అడగదు. యంత్రంలా తయారైంది. వంట ఇంటి కుందేలయింది. వంటిల్లంటే గుర్తొచ్చింది. ఓ మిక్సీ, గ్రైండరూ కొనిపడేయాలి. వీలైతే ఓ ఫ్రిజ్జూ. ఇవన్నీ పెట్టాలంటే ఇల్లు చాలద్దూ. ఆ ఓనర్‌గాడికివ్వాల్సిన అద్దె బకాయి మొత్తం వాడి ముఖాన కొట్టి కొంచెం పెద్దిల్లు తీసుకోవాలి. అప్పుల వాళ్ళందరి ముష్టిపాత్రకు తెరదించాలి. పిల్లలకు డొనేషన్ కట్టయినా మంచి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పడెయ్యాలి. ప్రస్తుతం చదువుతున్న మునిసిపాలిటీ బడి ఒట్టి దరిద్రపు స్కూల్. ఇన్నేళ్ళయినా పిల్లలు కనీసం 'మమ్మీ' 'డాడీ' అని పిలవకుండా, 'అమ్మా' 'నాన్నా' అని చీప్‌గా సంబోధిస్తున్నారు. అమ్మను అపోలో ఆసుపత్రిలో చేర్పించి, చెల్లి కాలిక్కూడా అక్కడే ఆపరేషన్ చేయిస్తే బెటర్."

ఇదీ సుబ్బారావు అంతరంగంలో ఊరుతున్న ఊహల ఊట బావి.

తలే తాకట్టు పెట్టాడో... మోకాళ్ళే కుదువబెట్టాడో తెలీదు కాని ఎలాగైతేనేం ఐదొందలు సంపాయించగలిగాడు. అవతలి వాళ్ళలాగా ఆర్భాటంగా కాకపోయినా తన ఆఫీసులో నలుగురు బంట్రోతులు వెంటరాగా మానసికాడంబరంతో నామినేషన్ దాఖలు మహోత్సవాన్ని పూర్తిచేశాడు సుబ్బారావు. తనవెంట వచ్చిన వాళ్ళకు పీపాలకొద్దీ సారా పోయించలేననీ, తలా ఓ చాయ్ కొట్టిస్తాననీ ముందే ఒప్పందం కుదుర్చుకున్నాడు కాబట్టి ఆ పని కూడా పెద్ద కష్టం కాలేదు. తను నామినేషన్ వేసేటప్పుడు పేపర్లవాళ్ళు ఎగబడి ఫోటోలు తీస్తారనీ, తనను ఇంటర్వ్యూలు చేస్తారనీ ఎంతగానో ఊహించి, ఆ మేరకు ప్రిపేరయి వచ్చాడు. ఇంటి దగ్గర రిహార్సల్స్ కూడాను. అయితే కనీసం స్థానిక పత్రికలవాళ్ళు కూడా సుబ్బారావు ఉనికినే గుర్తించలేదు. అయినా సుబ్రావ్ నిరుత్సాహపడలేదు. 'రాజకీయాల్లో 'స్పోర్టివిటీ' అవసరం' అని సరిపెట్టుకున్నాడు.

సరిపెట్టుకోవటం, సమాధానపడటం, రాజీపడటం లాంటివి బహుశా మధ్యతరగతి మానవుడికి చేతనైనంతగా మరెవరికీ చేతకావేమో!

పోలింగ్ తేదీ దగ్గరకు వస్తోంది. ముందైతే తానెటువంటి ప్రచారమూ చేయలేదుగానీ, తన ఉనికిని పెద్ద పార్టీ క్యాండిడేట్లు గుర్తించాలంటే కనీస స్థాయిలోనైనా కాన్వాస్ చేయాలన్న ఓ స్నేహితుడి సలహా సుబ్బారావుకు నచ్చింది. కష్టమే అయినా తప్పదనిపించింది.

అంతే... సుబ్బలక్ష్మి మెళ్ళో ఆమె పుట్టింటి వాళ్ళిచ్చిన బంగారు సూత్రాలు చిన్న శబ్దం వచ్చి మాయమయ్యాయి. ఆ డబ్బుతో ఓ కుంటి రిక్షాలో, డబ్బా మైకునొకదాన్ని పెట్టి తనే ప్రచారం చేసుకోవటం ప్రారంభించాడు.

అతడిది 'బొచ్చె' గుర్తు.

అట్టడుగువర్గాలకూ, కొండొకచో మధ్యతరగతి వాళ్ళకూ, అతిసన్నిహితమైన, అవసరమైన

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

వస్తువు కాబట్టి సుబ్బారావు ఆ గుర్తును ప్రిఫర్ చేశాడు. తవ మేధాశక్తికి తనే తెగమురిసిపోయాడు. బహుశా ఓ రాజకీయవేత్త కాబోయే లక్షణాలు తవలో పొడసూపుతున్నాయి కాబోలు. భవితవ్యం తవ బుర్రక్షేత్రంలో సుందరహర్మ్యంగా, రూపుదిద్దుకుంటోంది.

*　*　*

పోలింగ్ తేదీ దగ్గరకొచ్చేస్తోంది. ఎవరూ సుబ్బారావు దగ్గరకు రాలేదు. ఉపసంహరించుకొమ్మని అడగలేదు. ఏజెంట్ పాసు వెంతకమ్ముతావని బేరం పెట్టలేదు. కనీసం తనంటూ ఒకడ్ని బరిలో వున్నానని కూడా గుర్తించలేదు. సుబ్రావ్‌కు మహా బెంగగా వుంది. నామినేషన్ తాలూకూ అయిదొందల బాకీ వాడు వత్తిడి చేస్తున్నాడు. ఉన్న బాకీ వాళ్ళకు తోడు వీడొకడు. తన సందులో మరో ముష్టివాడు.

*　*　*

రెండ్రోజుల్లోనే పోలింగ్. సుబ్బారావుకు యమ టెన్షన్‌గా వుంది. డెఫినెట్‌గా ఇవాళ ఏదో పార్టీ అభ్యర్థి ఇంటికొస్తాడని చచ్చేంత నమ్మకంగా వుంది. 'సుబ్రావ్ వూళ్ళో వున్నాడా? ఇవాళ రాత్రికి ఇంటిదగ్గరే వుంటాడా?' అంటూ రెండు పార్టీల క్యాండిడేట్లూ వాకబు చేశారు. అదీ సుబ్రావ్ నమ్మకానిక్కారణం. అమ్మయ్య! ఇన్నాళ్ళకు తన ఆలోచన ఫలించింది. ఇవాల్టితో తన దరిద్ర పర్వానికి స్వస్తివాక్యం. మళ్ళీ కళ్ళ ముందు వూహలు. మొహం మీద రింగులు.

*　*　*

రాత్రి 11 గంటల సమయం. తలుపులు టకటక చప్పుడు. అసలు సుబ్బారావు తలుపు గడియపెట్టలేదు. మేల్కొనే వున్నాడు. నిద్రపట్టి చస్తేగా. తలుపు మొదటి 'టక'కే ఎగిరిగంతేసి తలుపులు తీశాడు. వాళ్ళెవరో తెలీదు. నెత్తుటితో బ్రష్ చేసుకునేవాళ్ళలా, నరమాంసాన్ని అల్పాహారంగా తీసుకునేవాళ్ళలా అదోమాదిరిగా వున్నారు. అయినా సుబ్బారావు బెదరలేదు. బెదిరితే బేరం తగ్గచ్చు. తన పిచ్చిగానీ ఈ రోజుల్లో రాజకీయనాయకుల అనుచరగణం అలా వుండక ఏదైనా పీఠాధిపతుల్లా పవిత్రంగా, ప్రశాంతంగా కనిపిస్తారా? సుబ్బలక్ష్మీ పిల్లలు కూడా మేల్కొనే వున్నారు.

"మిమ్మల్ని సార్ రమ్మంటున్నారు" గొంతులో ఏదో ట్రాక్టర్ స్టార్టయినట్లు. "తొందరగా బయల్దేరు. సారుకు యేరే పనుంది" కరకుగా ఆదేశించాడు.

పెద్దపార్టీల వాళ్ళు ఐదు నోట్లో, పది నోట్లో ఇస్తే లెక్కపెట్టుకోవడం కష్టమనే ఉద్దేశంతో, నలుగురైదుగురు సహాయకుల్ని సిద్ధంగా వుంచుకున్నాడు సుబ్బారావు. ఎంత దూరదృష్టి! తన బుజ్జి బుర్రపై సుబ్బారావుకు రోజురోజుకూ గౌరవం పెరిగిపోతోంది. వచ్చిన వాళ్ళతో బయలుదేరాడు. ఒక్కడే, వాళ్ళ ఆదేశం మేరకు

*　*　*

ఇంటి దగ్గర నుంచి బయల్దేరబోతూ కొంచెం పెద్దదిగా, గట్టిగా వున్న సంచి తెచ్చుకున్నాడు డబ్బు తెచ్చుకోవడం కోసం.

సుబ్బారావుతో బయల్దేరిన జీప్ సందుచివర ఆగింది.

'దిగు' ఓ స్వరం గద్దించింది.

'ఇదేవిటి? మీ సార్ ఇల్లు ఇక్కడ కాదుగా" అమాయకంగా సుబ్బారావు. "నోర్మూయ్యరా పిచ్చినాకొడకా. ఎట్టాగైనా పోలింగ్ ఆగిపోవాలని మా సారు జెప్పాడు. ఈ పాలి ఎలచ్చన్లో మా సారు గెలవటం కట్టమని తేలిపోయింది. అందుకే పోలింగ్ ఆగిపోవాలంటే ఇదొక్కటే దారి. ఏవీ అనుకోబాక" గరగర గొంతు.

వాడి మాటలు సుబ్బారావుకేవీ అర్థం కాలేదు. దూరంగా వెలుగుతున్న ట్యూబ్‌లైట్ కాంతిలో వాళ్ళ చేతుల్లో కత్తులూ, గొడ్డళ్ళూ తళుక్కున మెరిశాయి.

ఏదో అఘాయిత్యం జరగబోతోంది.

'ఐ విట్‌నెస్'గా మనకెందుకులే అనుకున్నాడో ఏమో ... పున్నమిచంద్రుడు మబ్బుల దుప్పటి కప్పుకున్నాడు.

అరాచకాలకూ, అఘాయిత్యాలకూ తను వేదికనయిపోతున్నందుకు అర్థరాత్రి మౌనంగా రోదించింది.

సుబ్బారావు చావుకేక ప్రతిస్పందన లేని ఆ పరిసరాల్లో ప్రతిధ్వనించింది. జీప్ వెళ్ళిపోయింది.

నెత్తుడి మడుగులో కొద్దిసేపు విలవిల కొట్టుకున్న సుబ్బారావు, ఆ తర్వాత కొట్టుకునేందుకు శక్తిలేక ... కాదు ప్రాణంలేక ఆగిపోయాడు.

చుట్టుపక్కల కొన్ని వందల జతల కళ్ళు ఆ దారుణాన్ని చూశాయి. అయితే "అలాంటివి చూడకూడదమ్మా! తప్పు" అన్న వాళ్ళ అంతరాత్మ ప్రబోధం విన్న ఆ కళ్ళూ, వాకిళ్ళూ టపటప మూసుకున్నాయి.

వీధి నిర్మానుష్యం ... సుబ్బారావు శవం తప్ప. కేక విని పరుగెత్తుకొచ్చిన సుబ్బలక్ష్మి, ఆమె సంతానం శవానికి దూరంగా ఏడుస్తూ.

పొలిటికల్ మర్డర్ కాబట్టి పంచనామా పూర్తయేవరకూ శవాన్ని ముట్టుకునేందుకుగానీ, పైనబడి ఏడ్చేందుకూ పోలీసులు అంగీకరించ లేదు.

అరాచక రహిత రాజకీయానికి నాలుగు దశాబ్దాల అనంతర జాతి చరిత్రలో తావు లేదన్న వర్తమాన మృత్యు మందహాసం సాక్షిగా ...

ఆశలూ, ఊహల లక్ష్మణరేఖల దాటి ఉన్నత భవిష్యత్తుకై ఆరాటపడే ఈ దేశపు మధ్య తరగతి గాళ్ళ సగటు కక్కుర్తి సాక్షిగా ... "అప్పెగ్గొట్టి చచ్చాడే ... ముదనష్టపు ముండా కొడుకు" అని తిట్టుకుంటున్న అప్పుల వాళ్ళ మహోన్నత మానవత్వం సాక్షిగా...

భర్తపోయినందుకు మాత్రమే కాక ఈ సంతానాన్ని ఎలా బ్రతికించాలన్న భయంకర ప్రశ్నాకారం ముందు సమాధానం లభించక బిక్కమొహం వేసుకున్న సుబ్బలక్ష్ముల సాక్షిగా...

ఏ సమస్య పరిష్కారానికైనా ఎవరి మీదనో ఆధారపడాల్సిన సుబ్బారావులాంటి 'మధ్య' జీవులు ఎప్పటికీ 'డిపెండెంట్లే' గానీ, ఎన్నటికీ ఇండిపెండెంట్లు కాలేరన్న వాస్తవం సాక్షిగా ... సుబ్బారావు చచ్చిపోయాడు.

*　*　*

మర్నాడు పేపర్లో పెద్దక్షరాల్తో బ్యానర్ వార్త "ఇండిపెండెంట్ హత్య ... ఎన్నిక వాయిదా" ●

## సంక్రాంతివేళ

మిరప తోట మధ్య విరగబూచెను జూడు
ముద్ద బంతి చెట్టు మోహనముగ
మరుకు చూపుతోడ సోయగమ్మును గల్పి
నవ్వు రువ్వు చున్న నాతివోలె

పేడ కలయంపి జల్లుచు వేడ్కమీఱ
రంగురంగుల ముగ్గుల రథము దీర్చి
ముగ్గులకు మధ్య గొబ్బెమ్మ మూర్తినిలిపి
పల్లె పడుచులు పాటలు పాడుచుండె

శంఖనాదమ్ము వినిపించు జంగమయ్య
శ్రావ్యముగనున్న హరిదాసు రాగలహరి
ఇంటి ముంగిట జేరిన పంటలెల్ల
రమ్యముగ దోచె మకర సంక్రాంతి వేళ

తనదు యజమాని ఆజ్ఞలన్ తప్పకుండ
కనుల పండువు సేసెను గంగిరెద్దు
ఎన్ని విధముల శిక్షణ నిచ్చినను; మ
నుజునకు బుజు వర్తనము విమాత్మమయ్యె

— డాక్టర్ గుమ్మా సాంబశివరావు